సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 22 । నవంబర్ । 2024



ఏవోబీలో ఉద్రిక్తత

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌తో బలగాలు మోహరించాయి. 8లో



మెరుగైన వైద్యం అందించాలి

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. 8లో



28న పాడేరులో జాబ్‌మేళా

పాడేరు డిగ్రీ కళాశాలలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రోషిణి తెలిపారు. 8లో

మణిపూర్ రాష్ట్రంలో సంప్రదాయ క్రీడగా విశేష ఆదరణ పొందిన థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌పై జిల్లా యువత ఆసక్తి చూపుతోంది. జిల్లా కేంద్రమైన పాడేరులో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్ జిల్లా పోటీల్లో జిల్లాకు చెందిన యువతీ యువకులు ప్రతిభ కనబరిచారు. ఈ క్రీడలో రాణించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, మంచి అలవాట్లు అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా అమ్మాయిల ఆత్మరక్షణకు దోహదపడటమే కాకుండా ఎలాంటి పరిస్థితులను అయినా దీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని వారు అభిప్రాయపడ్డారు. విశాఖలో ఖేల్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వారు పేర్కొన్నారు.



థాంగ్ టా.. కత్తితో ఆట

పెరుగుతున్న ఆదరణ

- ప్రతిభ చూపుతున్న జిల్లా యువత
- రాణిస్తున్న బాలికలు
- ఆత్మ రక్షణకు దోహదపడుతుందని ఆశాభావం
- విశాఖలో ఖేల్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తే మరింత మేలు
- అభిప్రాయం వ్యక్తం చేసిన క్రీడాకారులు, నిపుణులు

మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి చూపుతున్న గిరి యువత

పాడేరు: థాంగ్ టా... ఈ క్రీడకు జాతీయస్థాయిలో గుర్తింపు ఉంది. థాంగ్ అంటే కత్తి.. టా అంటే డాలు అని అర్థం. ప్రాచీన కాలంలో ఈ క్రీడను రాజులు యుద్ధక్రీడగా అభివర్ణించేవారు. దీనికి 2011లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు లభించింది. జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీల్లో 26 జిల్లాలకు చెందిన 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 11, అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వీటిలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 36 మంది పాల్గొన్నారు. వీరిలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పాల్గొన్న 12 మందిలో ముగ్గురు ప్రథమ స్థానం, ఒకరు ద్వితీయస్థానం సాధించారు.



అండర్–17 బాలికల విభాగంలో తలపడుతున్న క్రీడాకారిణులు

ఎంతో ఆనందంగా ఉంది



మూడేళ్లగా థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటున్నా. పాడేరులో నిర్వహించిన అంతర్ జిల్లాల పోటీల్లో అండర్ 19 విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన క్రీడాకారుడితో తలపడి విజయం సాధించా. త్వరలో మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. అక్కడ కూడా రాణించి రాష్ట్రానికి మరింత గుర్తింపు తీసుకువస్తా.

– అనంత్‌కుమార్, థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుడు, పార్వతీపురం

జాతీయ స్థాయి పోటీలకు అల్లూరి క్రీడాకారులు



బహుమతి అందుకుంటున్న మినుముల నాగసాయి తన్మయశ్రీ

జిల్లాకు చెందిన 12 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా నలుగురు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిలో అండర్–17 విభాగంలో జి.మాడుగుల కేజీబీవీ పాఠశాలకు చెందిన ఎస్.రమ్య, అరకువేలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.ఐశ్వర్య, పాడేరు తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన లీలాప్రసాద్ ప్రథమ స్థానం సాధించారు. పాడేరుకు చెందిన మినుముల నాగ సాయి తన్మయశ్రీ అండర్–14 విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది.

స్వీయ రక్షణకు ఎంతో ఉపయోగం



థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ నేటి కాలంలో మహిళలకు ఎంతో అవసరం. ఈ విద్య నేర్చుకోవడం ద్వారా స్వీయ రక్షణ పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి పాఠశాలలో థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడపై ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. అండర్ –17 బాలికల విభాగంలో తాను రాష్ట్ర స్థాయిలో తొలిస్థానంలో నిలిచా. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది.

– కె. మానస, అండర్–17, థాంగ్ టా క్రీడాకారిణి, విశాఖపట్నం

సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం



థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌ను నాలుగేళ్లగా నేర్చుకుంటున్నా. ఈ క్రీడ ద్వారా శారీరక దృఢత్వం, ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి ఈ ఆటపై మక్కువ పెంచుకోవాలి. ఈ ఆటను మరింత విస్తరించాలి. పాడేరులో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చూపాను. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణిస్తా.

– చైతన్య జోషి, అండర్–19 థాంగ్ టా క్రీడాకారుడు, విజయనగరం

విశాఖలో ‘ఖేల్ ఇండియా’ ఏర్పాటుచేయాలి



థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడ ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో ప్రాచుర్యం పొందుతోంది. 2019లో రాష్ట్రంలో థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. 2022లో జరిగిన ఖేల్ ఇండియా పోటీల్లో నలుగురు సత్తా చాటారు. ఈ ఆటను ప్రభుత్వం గుర్తించి విశాఖపట్నంలో ఖేల్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– ఎం. తులసిరావు, ప్రధాన కార్యదర్శి, థాంగ్ టా అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

అకాడమీల ఏర్పాటు అవసరం



థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడ మణిపూర్‌లో ఎంతో ప్రాచుర్యం పొందింది. యువత తమకు తాముగా రక్షించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి పాఠశాలలో ఈ విద్యను నేర్పించాలి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఇప్పుడిప్పుడే ఈ క్రీడపై ఆసక్తి పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అకాడమీలు ఏర్పాటు చేయాలి.థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ కిట్లను సరఫరా చేయాలి.

– వి. సూరిబాబు, అధ్యక్షుడు, థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

ముగిసిన రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలు

- ‘థాంగ్ టా’ అండర్–14లో ఓవరాల్ చాంపియన్‌గా విశాఖపట్నం
- జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు
- విజేతలకు బహుమతి ప్రదానం

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్ జిల్లాల థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–14,17,19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్–14 బాల,బాలికల విభాగాల్లో ఓవరల్ చాంపియన్‌గా ఉమ్మడి విశాఖపట్నం, రెండో స్థానంలో తూర్పుగోదావరి, మూడో స్థానంలో విజయనగరం, అండర్–17 బాలబాలికల విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌గా తూర్పుగోదావరి, రెండో స్థానంలో విజయనగరం, మూడో స్థానంలో విశాఖపట్నం, అండర్ –19 బాల, బాలికల విభాగంలో ఓవరాల చాంపియన్‌గా మొదటి స్థానంలో విజయనగరం, రెండో స్థానంలో తూర్పుగోదావరి, మూడో స్థానంలో విశాఖపట్నం జట్లు నిలిచాయి. విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మజీరావు, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి జగన్‌మోహన్‌రావు, పాఠశాల హెచ్‌ఎం సుమిత్ర చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన జట్లు త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండబాబు, మాజీ కార్యదర్శి సూరిబాబు, వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ మత్స్యరాస భూపతిరాజు, ప్రతినిధులు రామ్ నాయుడు, రాజు పడాల్, సత్యవతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న డీఈవో బ్రహ్మజీరావు, క్రీడాభివృద్ధి అధికారి జగన్‌మోహన్‌రావు

విజయవంతంగా ‘ఏకలవ్య’ క్రీడా పోటీలు



ఆర్చరీ పోటీలో పాల్గొన్న యువకులు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అరకులోయ టౌన్: స్థానిక క్రీడా పాఠశాల మైదానంలో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి 4వ జోన్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్రీడా పోటీలు రెండో రోజు గురువారం విజయవంతంగా జరిగాయి.

- పార్వతీపురం మన్యం జిల్లా అనసభద్ర, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ ఈఎంఆర్‌ఎస్ విద్యార్థుల మధ్య మధ్య వాలీబాల్ పోటీ హోరాహోరీగా సాగింది. డుంబ్రిగుడ రన్నర్‌గా నిలిచింది.
- యోగాలో చింతూరు ఈఎంఆర్‌ఎస్‌కు చెందిన ఎం. అంజలి ప్రథమ స్థానం, కండ్రిగకు చెందిన శృతి రెండవ స్థానం, చింతూరుకు చెందిన కె. రూపశ్రీ తృతీయస్థానం, ములియపుట్టికి చెందిన ధరణి నాల్గవ స్థానంలో నిలిచారు.
- అండర్–14 ఆర్చరీ విభాగంలో అనంతగిరి ఈఎంఆర్‌ఎస్‌కు చెందిన వి. జీవన్‌కుమార్ ప్రథమ స్థానం, మిగతా మూడు స్థానాల్లో అడ్డతీగలకు పాఠశాలకు చెందిన కె.అభి, అనంతగిరి ఈఎంఆర్‌ఎస్‌కు చెందిన ఎస్. శ్యామ్ ప్రకాష్, అడ్డతీగలకు పాఠశాలకు చెందిన చదక కిరణ్ మోహన్ నిలిచారు.
- బ్యాడ్మింటన్ అండర్–14 బాలుర విభాగంలో మారేడుమిల్లి ప్రథమస్థానం, రెండోస్థానం అరకులోయ, మూడవ స్థానంలో డుంబ్రిగుడ కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో పాడేరు ప్రథమ, ద్వితీయస్థానంలో అనంతగిరి, తృతీయస్థానాన్ని వై.రామవరం జట్టు కైవసం చేసుకున్నాయి.
- బ్యాడ్మింటన్ అండర్–19 బాలుర విభాగంలో డుంబ్రిగుడ ప్రథమ, మారేడుమిల్లి ద్వితీయ, రాజవొమ్మంగి జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో వై.రామవరం ప్రథమ, చింతూరు ద్వితీయ, అనంతగిరి జట్టు తృతీయస్థానం కైవసం చేసుకున్నాయి.



రన్నింగ్ పోటీలో పాల్గొన్న యువకులు



ఫుట్‌బాల్ ఆడుతున్న యువకులు

న్యూస్‌రీల్

గురుకులంలో నిలిచిన బోధన

- అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల ఆందోళన ఎఫెక్ట్

కొయ్యూరు: సీఆర్‌టీలుగా పరిగణించాలని కోరుతూ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆందోళన చేయడంతో కొయ్యూరు గురుకుల పాఠశాలలో బోధన నిలిచిపోయింది. టెన్త్‌కు వరకు ఉన్న ఈ విద్యాలయంలో మొత్తం 22 మంది ఉపాధ్యాయులు ఉండగా వీరిలో 19 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఉన్నారు. వీరంతా బుధవారం నుంచి ఆందోళనకు దిగడంతో విద్యార్థులు బోధన పరమైన ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ ఏడాది జూన్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి వారు వినతిపత్రం అందించారు.దీనిపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగారు. దీనివల్ల బోధనకు అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ ఈ సమస్య పరిష్కారంపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయం ఏర్పాటుచేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నారు.

100 కిలోల గంజాయి స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

జి.మాడుగుల: పాడేరు వెళ్లే రోడ్డు మార్గంలో ఈదులబయలు జంక్షన్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా వంద కిలోల గంజాయి పట్టుబడినట్టు ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. ఆంధ్ర– ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం రాజస్థాన్ రాష్ట్రం బిల్వాడ జిల్లాకు చెందిన బిట్ లోహర్ అనే వ్యక్తి 100 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కారులో తీసుకు వస్తున్నాడు. మైదాన ప్రాంతాలకు తరలిస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కారును సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నిలకడగా జోలాపుట్టు నీటిమట్టం

డుడుమకు 1300 క్యూసెక్కుల విడుదల

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన జోలాపుట్టు జలాశయంలో నీటి మట్టం నిలకడగా ఉంది. ఇటీవల మన్యంలో చెదురుమదురుగా కురిసిన వర్షాలకు వరద నీరు భారీగా చేరడంతో నీటిమట్టం క్రమేపీ పెరిగింది. ప్రాజెక్ట్ సాధారణ నీటి మట్టం 2750 అడుగులు కాగా గురువారం నాటికి 2747.60 అడుగులు నమోదయింది. గత ఏడాది ఇదే రోజుకు 2727.20 అడుగుల నీరు ఉండేది. గత ఏడాదితో పోలిస్తే 20 అడుగులు అధికంగా ఉంది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం దిగువున్న డుడుమ జలాశయానికి ఒక గేట్లు ఎత్తి 13 వందల క్యూసెక్కులను గత రెండు రోజులుగా విడుదల చేస్తున్నారు. డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2580.70 అడుగుల మే నీరు ఉంది.



జోలాపుట్టు జలాశయం

104 నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలి

సిబ్బంది వినతి

ముంచంగిపుట్టు: 104 నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే చేపట్టాలని ఆ సంస్థ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఉమ్మడి విశాఖ జెడ్పీ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎంపీపీ అరిసెల సీతమ్మను గురువారం కలిసి అందజేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగులు కిముడు కృష్ణవేణి,గణపతిరాజు మాట్లాడుతూ మూడు నెలల వేతనాలు అందకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వం నిర్వహించడం కాకుండా, అరబిందో యాజమాన్యం నుంచి 104 ఉద్యోగులకు రావాలస్సిన బకాయిలను వసూలు చేసి అందజేయాలని వారు కోరారు. దీనిపై జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ 104 సిబ్బంది సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.



ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతి పత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

హుకుంపేట: తేనేటీగల దాడిలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మారుమూల గత్తుం పంచాయతీ జువ్విపాడుకు చెందిన గిరిజనులు గురువారం గ్రామ సమీపంలో వరి కోతలకు వెళ్లారు. పంట కోస్తున్న సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో జన్ని మంగ్లన్న, గెమ్మెలి డొంబు, వంతాల సేతు, వంతాల ఇంద్రా, వంతాల హర్సోతో పాటు ఆరు నెలల చిన్నారి గాయపడ్డారు. వీరిని కుటుంబ సభ్యులు 108లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



గాయపడిన దొంబు

పర్యాటక ఉత్సవాలకు ప్రణాళికలు

- వారపు సంతల్లో ప్లాస్టిక్ నిషేధం
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రత్యేక గుర్తింపు పొందిన మారేడుమిల్లి, అరకులోయ ప్రాంతాల్లో పర్యాటక ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవోలు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటక ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. గిరిజన యువతీయువకులకు హస్తకళలు, పర్యాటకం,ఆతిథ్య రంగాలలో తగిన శిక్షణకు ప్రతిపాదించాలన్నారు.జిల్లాలో డెస్టినేషన్ అథారిటీ ఏర్పాటు చేశామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారపుసంతల్లో ప్లాస్టిక్ అమ్మకాల నిషేధానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవోలను ఆదేశించారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా సంతల్లో గుడ్డ సంచులను విక్రయించాలే చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలపై షార్ట్ ఫిలింలు తయారు చేసి సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేపట్టాలన్నారు. వారపు సంతల్లో నకిలీ వస్తువులు,కల్తీ ఆహార పదార్థాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోటళ్లు లేని పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులు బస చేసేలా ఏర్పాట్లు చేయాలని, సాహస క్రీడలు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండాగ్రామసభలు నిర్వహించి, గిరిజనుల ఆమోదం తీసుకోవాలన్నారు. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని సంబంధిత పంచాయతీలకు కేటాయించాలని ఆదేశించారు. ఏజెన్సీ సందర్శనకు వచ్చే పర్యాటకుల వివరాలను సేకరించాలన్నారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, వర్చువల్‌గా ఐటీడీఏ పీవోలు కట్టా సింహాచలం, వి.అభిషేక్, అపూర్వభరత్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా పర్యాటకశాఖ అధికారి జి.దాసు, అరకు మ్యూజియం మేనేజర్ మురళీకృష్ణ, టూరిజం కన్సల్టెంట్ రత్నరాజు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అక్రమ వసూళ్లపై విచారణ



ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో విచారణ చేస్తున్న ఆర్‌ఐ భాస్కరరావు

పాడేరు : పట్టణంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో అక్రమ వసూళ్లపై ఆర్‌ఐ భాస్కరరావు విచారణ నిర్వహించారు. ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేసుకునే సమయంలో వినియోగదారుల నుంచి కొత్త గ్యాస్ పైపు కొనుగోలు చేయాలనే ఒత్తిడి తెచ్చారు. ఇందుకుగాను ఎమ్మార్పీ రూ.100 ఉండగా రూ.200కు విక్రయించారని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఐటీడీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్‌ఐ భాస్కర్‌రావు గురువారం విచారణ నిర్వహించారు. నివేదికను ఐటీడీఏ అధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

చలి వణికిస్తోంది

- నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- దట్టంగా పొగమంచు

అరకులోయ టౌన్: కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. ఈ ప్రాంతంలో దట్టంగా మంచు కురుస్తోంది. మరోపక్క చలిగాలులు వీస్తున్నాయి. గిరి రైతులు వ్యవసాయ పనులకు తెల్లవారక ముందే బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. మంచు కురుస్తున్నా తప్పనిసరి పరిస్థితుల్లో వరి నూర్పిడి పనులు చేపడుతున్నారు. చలితీవ్రతకు మంటలను ఆశ్రయిస్తున్నారు. ఇలావుండగా ఈ వాతావరణ పరిస్థితులు సందర్శను వచ్చే పర్యాటకులకు మంచి అనుభూతిని ఇస్తున్నాయి. చలిలో మంచు అందాలను తిలకించేందుకు మాత్రమే వారు వస్తుంటారు.

హుకుంపేట: దట్టంగా కురుస్తున్న పొగమంచుతో పాటు, చలి తీవ్రత పెరగడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11గంటల సమయం వరకు మంచు తెరలు వీడకపోవడంతో వ్యవసాయం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మండలంలో చలిగాలులు వీయడంతో మంటలను ఆశ్రయించారు,



అరకులోయ ప్రాంతంలో దట్టంగా పొగమంచు



గరుడాపల్లిలో మంట కాగుతున్న గిరిజనులు



వరి నూర్పిడిలో నిమగ్నమైన గిరి రైతులు

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ అనంతబాబు, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు

అడ్డతీగల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంతబాబు గురువారం విజయవాడలోని తాడేపల్లిలో ఆయన స్వగృహంలో కలిశారు.ఈ సందర్భంగా వైఎస్ జగన్ అనంతబాబుతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. అన్యాయంగా పార్టీ శ్రేణులను ఏ అధికారి అయినా వేధిస్తే అటువంటి వారిపై న్యాయపరంగా పోరాడాలని సూచించారు. అనంతబాబుతో పాటు వైఎస్సార్‌సీపీ అడ్డతీగల మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు ఉన్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబసభ్యులకు అందజేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని పాకవెల్తి గ్రామానికి చెందిన బాలమ్మకు పురిటినొప్పులు అధికమవడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. ఈ మేరకు ఆమెను జడ్డంగి పీహెచ్‌సీకి 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో వాతంగి వద్ద పురిటినొప్పులు అధికమవడంతో ఆమెకు సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. ఆమె ఆడబిడ్డను ప్రసవించింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు సిబ్బంది తెలిపారు.

అనారోగ్యంతో మహిళ మృతి

- నాటు వైద్యమే కారణమంటున్న గ్రామస్తులు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ కిల్లోగూడ గ్రామానికి చెందిన కుర్రా వరలక్ష్మి (25) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. గత కొద్ది నెలలుగా ఆమె వీపు, శరీరం వాచిపోవడం, చికిత్స పొందకపోవడంతో ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని బంధువులు తెలిపారు. దీంతో ఆమెను బంధువులు నాటు వైద్యం కోసం సమీప గ్రామానికి తీసుకెళ్లి, వైద్యం చేయించారని పలువురు చెప్పారు. అనంతరం నాటు వైద్యం వికటించి మృతి చెందినట్టు తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం, వేదికపై సబ్ కలెక్టర్ కల్పశ్రీ



శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులు

- విద్యార్థులకు మంచి నడవడికపై అవగాహన కల్పించాలి
- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో 18 సంవత్సరాల లోపు బాలికలు మంచి మార్గంలో నడిచే విధంగా వారికి అవగాహన కల్పించే బాధ్యత అందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఐసీడీఎస్, విద్యాశాఖ, వెలుగు, వైద్య ఆరోగ్య శాఖలతో కిషోర బాలికల వికాసం జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టి పెట్టే విధంగా చైతన్యం చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారమివ్వాలన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు డిగ్రీ పూర్తి చేసిన తరువాత వివాహం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండా వివాహం చేసుకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ నుంచి శిక్షణలో పాల్గొన్న వారు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఏడీఎంహెచ్‌ఓ శిరీష, ఏపీడీ ఎస్.డేగలయ్య, సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మి, విజయగౌరి, డీపీఎం అపర్ణ పాల్గొన్నారు.

ఏవోబీలో ఉద్రిక్తత

- జిన్నెలిగూడ ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌తో కూంబింగ్ ముమ్మరం
- మోహరించిన పోలీసు బలగాలు

సీలేరు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న ఏవోబీ ప్రాంతం గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సరిహద్దు మల్కన్‌గిరి జిల్లా పొడయా బ్లాక్‌లో జిన్నెలిగూడ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఇందులో ఒక మావోయిస్టు మృతి చెందగా, జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. హోరాహోరీగా జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు తప్పించుకున్నట్టుగా ఒడిశా పోలీసులు భావిస్తున్నారు. వీరు సరిహద్దు ప్రాంతాల్లో తలదాచుకునేందుకు వచ్చే అవకాశం ఉన్నందున ఏవోబీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. కూబింగ్ ముమ్మరం చేశారు.

28న పాడేరులో జాబ్‌మేళా

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ రోషిణి

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.రోషిణి గురువారం తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఈ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, అపోలో ఫార్మసీ, రుద్ర కార్పొరేట్ సర్వీస్, మదర్ అండ్ ఫాదర్ హోమ్‌కేర్ సర్వీసెస్ కంపెనీలు పాల్గొంటున్నట్టు ఆమె తెలిపారు. జిల్లాలోని 18నుంచి 30సంవత్సరాల లోపు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులంతా పాన్, ఆధార్, ఇతర ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆమె కోరారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల లోపు వేతనాలు చెల్లిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు www.naipunyam.ap.gov.in తోపాటు 6302636174,9398338105 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు



మాట్లాడుతున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం సీఈవో డాక్టర్ రాజశేఖర్

పాడేరు : సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు వచ్చి లాభాలు పొందవచ్చని, ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించిన వారవుతారని సుస్థిర వ్యవసాయ కేంద్రం సీఈఓ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలో కాఫీ హౌస్‌లో సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో సంపూర్ణ గ్రామాభివృద్ధి కోసం చర్చ వేదిక కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర వ్యవసాయ కేంద్రం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సేంద్రియ వ్యవసాయం, విత్తనోత్పత్తి, జీవనోపాదులు, అర్గానిక్ సర్టిఫికేషన్, మార్కెటింగ్ తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎఫ్‌పీఓలకు 75 శాతం సబ్సిడీతో నాణ్యమైన పరికరాలను, విత్తనాలను పంపిణీ చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హృదయ ప్రాజెక్టు ప్రతినిధి రామ్‌ప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీఏ ఎంఎస్ శ్రీనివాస్, డీఐఓ డాక్టర్ శారద, ఉద్యానవనశాఖ ఎంహెచ్‌ఓ శరణ్య కుమారి, గిరిసిరి ఎఫ్‌పీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు: వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీని గురువారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్‌లో రోగులకు ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారనే విషయాన్ని పరిశీలనలో భాగంగా ఆయన ఓ పాపకు చేస్తున్న మలేరియా రక్తపరీక్షను ఆయన గమనించారు. ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం కోసం మొక్కలు నాటాలని ఆయన వైద్యులకు సూచించారు.

అటవీ హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం



హాజరైన అధికారులు

రంపచోడవరం: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టంపై అవగాహన కల్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. రంపచోడవరంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం జన్ జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమం ద్వారా అటవీ హక్కుల చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పీవో , సబ్ కలెక్టర్ కల్పశ్రీలు పాల్గొన్నారు. పీవో మాట్లాడుతూ 2005 డిసెంబర్ 13కు ముందు నుంచి కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కొన్ని పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. 2005 సంవత్సరానికి ముందు గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరంలో రెండు రోజులు పాటు జరిగే అటవీ హక్కుల చట్టంపై రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమానికి పాడేరు, సీతంపేట, కేఆర్ పురం, చింతూరు పార్వతీపురం, ఐటీడీఏల నుంచి ఆర్‌ఓఎఫ్‌ఆర్ అధికారులు, అటవీహక్కుల కమిటీ మెంబర్లు, రైతులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా రాంగోపాల్, ఈశ్వరరావు, చంద్రకళ, మోహన్‌రావు, సంధ్య వ్యవహరించారు.

జీవో నంబర్-3 పై అసెంబ్లీలో చర్చ జరపాలని డిమాండ్

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి



ప్లకార్డులతో డిమాండ్ చేస్తున్న శాంతకుమారి, నాయకులు

డుంబ్రిగుడ: జీవో నంబర్-3పై ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరపాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శాంతకుమారి డిమాండ్ చేశారు. మండలంలోని అరకు గ్రామంలో ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో గిరిజనులకు వంద శాతం ఉద్యోగాలు కల్పించేందుకుగాను గతంలో జీవో నంబర్-3ను తీసుకొచ్చారన్నారు. అయితే ప్రస్తుతం ఆ జీవో రద్దు చేయడంతో గిరిజనులు ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అరకులో పర్యటించిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో నంబర్-3ను పునరుద్ధరిస్తానని బహిరంగంగా హామీ ఇచ్చారని అయితే అధికారంలో వచ్చి అయిదు నెలల గడుస్తున్న దానిపై చర్చ జరపకుండా ఉండడం విచారకరమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ సాయిబాబా, ఆదివాసీకాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, నాయకుడు చిన్నస్వామి, కార్యకర్తలు గోవింద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయ్

పాడేరు : అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలలో చదువుతున్న జి.అశోక్, పి.బుజ్జిబాబులు రెజ్లింగ్ పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించగా కె.దేవమ్మ, రమణబాబు కాంస్య పతకాలు సాధించారు. కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ రసూల్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్‌బాబు, గణేష్, దామోదర్‌రావు, గౌరీశంకర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ నాయుడు అభినందనలు తెలిపారు.

గంజాయి రవాణా కట్టడికి పటిష్ట చర్యలు

విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



పాయకరావుపేటలో వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ గోపీనాథ్ జెట్టి

సాక్షి, అనకాపల్లి: గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా పాయకరావుపేట, యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను, వాటి ప్రస్తుత దర్యాప్తు స్థితిని అడిగి తెలుసుకున్నారు. గంజాయి కేసుల పురోగతి, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చీటింగ్ ఇతర కేసుల ఫైల్స్, స్టేషన్‌లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టుకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీలైనంత తొందరగా చార్జిషీట్ ఫైల్ చేయాలని, కోర్టులలో విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, ముద్దాయిలకు శిక్ష పడేటట్లు పకడ్బందీగా వ్యవహరించాలని సూచనలు చేశారు. ప్రతి మహిళకు భద్రత కల్పించేందుకు అండగా పోలీస్ శాఖ ఉందని వారికి భరోసా కల్పించాలని తెలిపారు. సైబర్ నేరాలపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, పాయకరావుపేట సీఐ జి.అప్పన్న, యలమంచిలి రూరల్ సీఐ ఎస్.ధనుంజయరావు, ఎస్సైలు జె.పురుషోత్తం, సావిత్రి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యువ ఉత్సవ్ పోటీలకు ఎంపిక



మాడుగుల డిగ్రీ కళాశాలలో అనూష కుమారిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి, ఇతర ఉపన్యాసకులు

మాడుగుల రూరల్ : జిల్లా స్థాయి డిక్లమేషన్ (ఉపన్యాస)పోటీల్లో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ గణిత విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్ అనూషకుమారి ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని యువ ఉత్సవ్ 2024 కార్యక్రమంలో భాగంగా, విశాఖ నెహ్రూ యువ కేంద్రం జిల్లా స్థాయి యువ ఉత్సవ పోటీలు అనకాపల్లి జిల్లా గౌరీ గ్రంథాలయంలో ఈ నెల 16న నిర్వహించారు.

ఈ పోటీల్లో భారతదేశం –2047 అనే అంశం గురించి ఉపన్యాసించారు. పోటీల్లో జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనగా, అనూష కుమారి ప్రథమ బహుమతి సాధించింది. ఆమెకు రూ.5000 నగదు పారితోషకం, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనూషకుమారికి గురువారం సాయంత్రం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ శాస్త్రి, ఇతర ఉపన్యాసకులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు.

అగ్ని ప్రమాదాల్లో రెండు ఇళ్లు దగ్ధం



చూచిరేవులగూడెంలో దగ్ధమవుతున్న తెల్లం ముత్తయ్య పూరిల్లు



యార్లగడ్డలో అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

కూనవరం: మండలంలోని చూచిరేవులగూడెంలో గ్రామస్తుడు తెల్లం ముత్తయ్య తాటాకిల్లు బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ సంఘటనకు సంబంధించి సర్పంచ్ తెల్లం నిరోషా అందించి వివరాలు ఇలా ఉన్నాయి. బాధితుడు తెల్లం ముత్తయ్య కుటుంబం ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి 11 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటల చెలరేగాయని స్థానికులు గమనించి కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న వారు ఉలిక్కి పడి లేచి బయటకు పరుగులు తీశారు. కళ్ల ముందే ఇల్లు అగ్నికి అహూతమైందని బాధిత ముత్తయ్య కుటుంబం కన్నీరుమున్నీరయ్యారు. కట్టు బట్టలు మినహా సర్వం కాలిబూడిదైనట్టు చెప్పారు. ఇంట్లో నిల్వ ఉన్న రెండు క్వింటాళ్ల ధాన్యం, ఆరు గ్రాముల బంగారం, పట్టీలు, గ్యాస్ పొయ్యి, సామగ్రి మొత్తం ప్రమాదంలో దగ్ధమైనట్టు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు ముత్తయ్య కుటుంబానికి 25 కిలోల బియ్యం, నూనె, కిలో కందిపప్పును అందజేశారు. అలాగే రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సూచనల మేరకు బాధిత కుటుంబానికి రూ.10 వేలు నగదును కార్యకర్తలు అందజేశారు. కృష్ణార్జున ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరి కృష్ణార్జునరావు బాధిత కుటుంబానికి బియ్యం, దుప్పట్లు, బకెట్, చాప, కూరగాయలు, నూనె తదితర సామగ్రి అందజేశారు.

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గ్రామంలో స్థానికుడు అల్లంకుల మల్లయ్యకు చెందిన పూరిల్లు గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. సంఘటనపై స్థానికులు అందించిన వివరాలు ..ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు గ్రామంలో లేని సమయంలో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. పంచాయతీ కార్యదర్శి పుడిగి భార్గవచరణ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో పాటు గ్రామస్తులు మంటలను అదుపు చేసి, గ్రామంలోని మరికొన్ని ఇళ్లు కాలిపోకుండా కాపాడారు. బాధితుడు మల్లయ్య ఇంట్లో సామగ్రి అంతా కాలిబూడిదైంది.ప్రమాదంలో సుమారు రూ.1.50లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ పి.వేణుగోపాల్, డీటీ కె.సుధాకర్‌రావు, ఆర్‌ఐ ఎస్.శాంతకుమారి, వీఆర్వో ధనలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాద బాధితులు గ్రామానికి రాగానే సహాయం అందజేస్తామన్నారు.

24న విశాఖ మ్యూజియంలో ఉచిత ప్రవేశం

దాబాగార్డెన్స్: వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా ఈ నెల 24న విద్యార్థులకు, సందర్శకులకు విశాఖ మ్యూజియంలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా పురావస్తు శాఖ, ఇంటాక్ సంయుక్తంగా ఆ రోజున కందుల వేంకటేష్ సేకరించిన నాణేలు, శిలాజాలను ప్రత్యేకంగా మ్యూజియంలో ప్రదర్శించనున్నట్టు చెప్పారు.

రేపటి నుంచి 'ట్వంటీ- 20'

- ఎస్ఎంఏ టోర్నీకి విశాఖ సిద్ధం

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ ధనాధన్(టీ–20) క్రికెట్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. దేశంలోని 38 జట్లు ఐదు గ్రూప్‌ల్లో సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్ఎంఏ) ట్రోఫీలో తలపడుతుండగా విశాఖ వేదికగా గ్రూప్ డీ పోటీలు జరగనున్నాయి. బుధవారం విశాఖ చేరుకున్న జట్లు గురువారం ప్రాక్టీస్ మొదలుపెట్టాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్ జట్లు శుక్రవారం ప్రాక్టీస్ చేయనున్నాయి. వైఎస్సార్ స్టేడియంలో ఈ నెల 23 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు రోజు విడిచి రోజు పోటీలు జరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఆడనున్న ఏడు జట్లలో గతేడాది విదర్భ జట్టు డీ గ్రూప్ విజేతగా నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా అసోం బీ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచి ప్రీక్వార్టర్స్ ఆడింది. విదర్భ జట్టు క్వార్టర్స్‌లోనే వెనుదిరగ్గా.. అసోం జట్టు సెమీస్‌కు చేరుకుంది. ఆంధ్రా జట్టు సీ గ్రూప్‌లో ఏడు మ్యాచ్‌లాడి మూడు విజయాలు, నాలుగు పరాజయాలతో ఆరో స్థానంలో నిలిచింది. ఈ సారి ఆంధ్రా 'ఈ'గ్రూప్‌లో ఆడనుంది.

ఇదీ షెడ్యూల్

తేదీ	సమయం	ఎవరితో ఎవరు
నవంబర్ 23	ఉదయం 11 సాయంత్రం 4.30	చండీగఢ్ X పుదుచ్చేరి విదర్భ X ఒడిశా
25	ఉదయం 11 సాయంత్రం 4.30	చండీగఢ్ X విదర్భ చత్తీస్‌గడ్ X పుదుచ్చేరి
27	ఉదయం 11 సాయంత్రం 4.30	చత్తీస్‌గఢ్ X రైల్వేస్ అసోం X చండీగఢ్
29	ఉదయం 11 సాయంత్రం 4.30	అసోం X విదర్భ ఒడిశా X పుదుచ్చేరి
డిసెంబర్ 1	ఉదయం 11 సాయంత్రం 4.30	చత్తీస్‌గఢ్ X ఒడిశా విదర్భ X రైల్వేస్
3	ఉదయం 11 సాయంత్రం 4.30	అసోం X ఒడిశా చండీగఢ్ X రైల్వేస్
5	ఉదయం 11 సాయంత్రం 4.30	పుదుచ్చేరి X రైల్వేస్ అసోం X చత్తీస్‌గఢ్

హైవేపై మృతి చెందిన కొండచిలువ



రాజవొమ్మంగి వద్ద జాతీయ రహదారిపై చనిపోయి కనిపించిన కొండచిలువ

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి గ్రామ శివారున జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఓ భారీ కొండచిలువ మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించారు. రాజవొమ్మంగి, జడ్డంగి గ్రామాల మధ్య రోడ్ క్రాస్ చేస్తుండగా వాహనాలు తొక్కేయడంతో మరణించి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కొండ చిలువ సుమారు 9 అడుగుల పొడవు ఉన్నట్టు తెలిపారు.

ముగ్గురు ఘరానా దొంగల అరెస్టు

- నాలుగు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్, నగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు పరిశీలిస్తున్న ఎస్పీ

అనకాపల్లి : జిల్లాలో వివిధ కేసుల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారం, సెల్‌ఫోన్లు , బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తమ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, సుమారుగా రూ.21 లక్షల 30వేలు విలువ కలిగిన 188 గ్రాముల బంగారం, మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. గొలుగొండ మండలం కేడీపేట గ్రామం ఎస్పీ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు, విశాఖ పెదగంట్యాడ మండలం గంగవరం, ధారవీధికి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4 కేసుల్లో సుమారుగా రూ.11 లక్షల 30వేలు విలువ గల 45 గ్రాముల బంగారు హారం, 4 ద్విచక్ర వాహనాలు, ఒక సెల్‌ఫోన్, పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 చోరీ కేసుల్లో రూ.10 లక్షల విలువ గల 143 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో అదనపు క్రైం ఎస్పీ ఎల్.మోహన్‌రావు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడు, సీఐలు ధనంజయరావు, గణేష్, సీసీఎస్ ఎస్ఐ రమేష్, సత్యనారాయణ, ఏఎస్ఐ కుమార్, హెచ్‌సీ అప్పలరాజు పాల్గొన్నారు.